నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శుక్రవారం 28 మార్చి 2025 | ADILABAD NIRMAL

ఎండిపోయిన కాలువను చూపుతున్న రైతు జాదవ్ లఖన్‌సింగ్

### రూ.2 లక్షలు నష్టపోతున్న..

నా పేరు జాదవ్ లఖన్ సింగ్. నాకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. చెరువులో నీరు లేకపోవడంతో కూరగాయలు సాగు చేయలేదు. చెరువులో నీరు ఉండి ఉంటే.. దాదాపు కూరగాయలు సాగు చేసి దాదాపు రూ.2 లక్షల పంట తీసేవాడిని. ఈ డబ్బులు నష్టపోవాల్సి వస్తున్నది. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోర్ బావులు వేయడం లేదు.

# అడుగంటిన జలాలు.. ఎండుతున్న పంటలు



సాగు నీరు లేకపోవడంతో ఎండుతున్న మక్క పంట

ఇంద్రవెల్లి, మార్చి 27 : ఎండలు ముదురుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఇంద్రవెల్లి మండలంలోని ఏమాయికుంట గ్రామ పంచాయతీ పరిధిలో గల గురువుదేవ్ చెరువులో నీరు ఇంకిపోవడంతో ఎడారిని తలపిస్తున్నది. దీని ఆయకట్టు పరిధిలో దాదాపు 70 ఎకరాల వరకు రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. చెరువుల నీటిపై అధారపడి జొన్న, గోధుమ, మక్క పంటలను సాగు చేశారు. నీరు అందకపోవడంతో చేతికొచ్చిన పంటలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం యాసంగి పంటలపై సర్వేలు నిర్వహించి ఎండిన పంటల రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

అడుగంటిన ఏమాయికుంట గురుదేవ్ చెరువు

## రూ.4 కోట్లతో షాదీఖాన మంజూరు చేయాలి

అసెంబ్లీలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, మార్చి 27 : అసెంబ్లీలో జరిగిన క్వశ్చన్ అవర్‌లో గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడారు. ఆదిలాబాద్ – బోథ్ – అడెల్లి రోడ్డు కోసం గత ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇంకా రూ.4 కోట్ల అవసరం ఉన్నాయని, ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. అలాగే ఇచ్చోడలో షాదీఖాన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. ప్రభుత్వం రంజాన్ మాసాన్ని దృష్టిలో పెట్టుకొని తక్షణమే షాదీఖాన మంజూరు చేయాలని కోరారు.

- రెండు రోజులే ఉన్నా పట్టణాల్లో ఏడు శాతం దాటని చెల్లింపు
- పల్లెల్లో 16,241 దరఖాస్తులకు డబ్బులు కట్టింది 913 మందే..
- అవి కూడా ఎల్-1 దశలోనే పెండింగ్.. అందని ప్రాసీడింగ్ కాపీలు
- క్రమబద్ధీకరణపై అధికారులకు కొరవడిన స్పష్టత

# అయోమయం.. గందరగోళం..

నిర్మల్ మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

## నిర్మల్ జిల్లాలో ఎల్ఆర్ఎస్‌కు స్పందన కరువు

నిర్మల్, మార్చి 27(నమస్తే తెలంగాణ) : లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎల్) గడువు మరో రెండు రోజులే మిగిలి ఉన్నది. దరఖాస్తుదారులు తమ స్థలాలకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవాలని ఈనెల 30వ తేదీ వరకు గడువు విధించింది. అయితే అధికారుల హడావుడి, అనాలోచిత చర్యల కారణంగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియ అంతా అయోమయం, గందరగోళంగా మారింది. ఖజానా నింపుకోవాలనే క్రమంలో అధికారుల తొందరపాటుతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మూడు దశల్లో జరగాల్సిన ప్రక్రియను తొందరగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు దరఖాస్తుల తీరు మారుతున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకే సర్వే నంబర్‌లో ఒకరికి ఎల్ఆర్ఎస్ అప్రూవ్ రాగా, మరో దరఖాస్తుదారుడికి అదే సర్వే నంబర్‌లోని స్థలం ప్రొహిబిటెడ్ జాబితాలో ఉన్నదని ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నది. దీంతో కొందరు తమ విలువైన స్థలాలను ప్రొహిబిటెడ్ జాబితా నుంచి తొలగించుకునేందుకు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సరైన సర్వే చేయకుండానే చాలా మంది స్థలాలను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపణలు వస్తున్నాయి. ఆదరాబాదరాగా నిర్వహిస్తున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు ప్రజల నుంచి పెద్దగా స్పందన రావడం లేదు. మరో రెండు రోజులే గడువు ఉన్నా దరఖాస్తుల్లో పురోగతి కనిపించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాట్లను క్రమబద్ధీకరించి సొమ్ము చేసుకోవాలనే లక్ష్యంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను తెరమీదికి తెచ్చిందని సామాన్యులు చర్చించుకుంటున్నారు. ఎన్నికలకు ముందు పూర్తి ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని చెప్పి ఇప్పుడు లక్షల రూపాయలు దండుకోవడంపై అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారు. డబ్బులు చెల్లించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే అధికారులు అప్‌డేట్ చేస్తున్నారు. డబ్బులు చెల్లించిన సంబంధిత దరఖాస్తుల పురోగతి(స్టేటస్) గందరగోళంగా మారింది. వాస్తవానికి ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను మూడు దశల్లో వడపోసిన తర్వాత సదరు దరఖాస్తుదారుడికి ఫీజు చెల్లించాలన్న సమాచారం చేరవేయాలి. కానీ.. అధికారుల తొందరపాటు కారణంగా సమీపంలో లేని ప్రభుత్వ భూములు, చెరువు స్థలాలకు సంబంధించిన సర్వే నంబర్లను పట్టా భూముల్లో చేర్చడంతో అవి కాస్త ప్రొహిబిటెడ్ జాబితాలో చేరిపోయాయి. వీటిపై ముందుగా పరిశీలించకుండానే ఫీజులు చెల్లించాలని దరఖాస్తుదారులపై ఒత్తిడి చేస్తుండడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. ఒక వేళ ఫీజు కట్టిన తర్వాత రెండు, మూడో దశ పరిశీలనలో స్థలంపై ఏదైనా వివాదం ఉంటే అప్పటికే ప్రభుత్వానికి చెల్లించిన ఫీజు తిరిగి వాపసు వస్తుందో లేదోనన్న అయోమయంలో దరఖాస్తుదారులు ఉన్నారు.

### డబ్బులు చెల్లించినా ఎల్-1 దశలోనే ఉంది..

నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధిలో గల సర్వే నంబర్ 96లో ఓ వ్యక్తి 1573 గజాల ఖాళీ స్థలాన్ని ఎనిమిదేండ్ల కింద కొనుగోలు చేశాడు. అయితే ఆ వెంచర్ జీపీ లే అవుట్లలో ఉందని చెప్పడంతో గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కట్టుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో 19-10-2020 లో ఫీజు చెల్లించి నమోదు చేసుకున్నాడు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి ఫీజు చెల్లించి తమ స్థలాలను రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించి, ఈ నెల 30 వరకు గడువు విధించింది. దీంతో సదరు వ్యక్తి ఈ నెల 10 రూ.2.15 లక్షలను ప్రభుత్వానికి చెల్లించాడు. అయితే ఇందుకు సంబంధించి స్థలం రెగ్యులరైజ్ అయినట్లు ప్రొసీడింగ్ కాపీ ఇంతవరకు ఆయనకు అందలేదు. దీనిపై ఆ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా.. మీ అప్లికేషన్ ఇంకా ఎల్-1 దశలోనే ఉన్నదని, ఎల్-1, ఎల్-2, ఎల్-3 స్థాయిలో పరిశీలన పూర్తయిన తర్వాతనే క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తయినట్లని చెప్పారు. మరి ఆయా దశల్లో ఏవైనా అవాంతరాలు ఏర్పడితే కట్టిన ఫీజు వాపసు చేస్తారా? అని సదరు వ్యక్తి అడిగితే.. ఆ విషయం మాకు తెలియదని సమాధానం చెబుతున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ఫోన్ చేసి డబ్బులు కట్టించడం వరకే మా పని అని, మిగతా వివరాలపై తమకు స్పష్టత లేదని పంచాయతీ కార్యదర్శి చెప్పడంతో సదరు వ్యక్తి చేసేదేమి లేక వెనుదిరిగాడు. రూ.2 లక్షలకు పైగా ప్రభుత్వానికి ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించి ప్రొసీడింగ్ కాపీ కోసం ఎదురు చూడాల్సి వస్తున్నదని ఆయన వాపోయాడు.

### గందరగోళంగా ప్రక్రియ

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే ఉండడంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తిగా గందరగోళంగా మారింది. దీంతో గ్రామాల పరిధిలోని ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తుదారులు పెద్దగా ముందుకు రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం 17,967 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో సరైన పత్రాలు లేని కారణంగా 71 దరఖాస్తులను తిరస్కరించారు. అలాగే కొన్ని స్థలాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో ఉన్నాయంటూ మరో 925 దరఖాస్తులను ప్రొహిబిటెడ్ జాబితాలో పెట్టారు. ఇవి పోగా మిగిలిన మొత్తం 16,241 దరఖాస్తులను ఎల్ఆర్ఎస్‌కు అర్హత ఉన్నవిగా గుర్తించారు. వీరికి ఆయా పంచాయతీల పరిధిలోని కార్యదర్శులు ఫోన్లు చేసి మీ ప్లాట్‌కు ఫీజు కట్టి క్రమబద్ధీకరించుకోవాలని సూచిస్తున్నారు. అయినా ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో కేవలం 913(5.6శాతం) దరఖాస్తుదారులు మాత్రమే పూర్తి ఫీజును చెల్లించారు. అయితే ఇప్పటి వరకు వీరిలో ఒక్కరికి కూడా తమ స్థలాలు రెగ్యులరైజ్ అయినట్లు ప్రొసీడింగ్ కాపీలు అందలేదు. ఫీజు చెల్లించినప్పటికీ ఇంకా వివిధ దశల్లో సదరు స్థలాలపై విచారణ జరుపాల్సి ఉంటుందని, ఆ తర్వాతే సంబంధిత స్థలం పూర్తిగా రెగ్యులరైజ్ అయినట్లు అని అధికారులు చెబుతున్నారు. దీంతో ఎల్ఆర్ఎస్ కోసం డబ్బులు చెల్లించినప్పటికీ.. ప్రక్రియ పూర్తి కావడానికి దరఖాస్తుదారులు మరికొన్ని రోజులు నిరీక్షించాల్సివస్తున్నది.

### పట్టణాల్లో 7 శాతం దాటని ఫీజుల చెల్లింపు

నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీల పరిధిలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తుదారుల నుంచి పెద్దగా స్పందన లభించడం లేదు. ఇప్పటి వరకు ఆయా పట్టణాల్లో ఫీజుల చెల్లింపు 10 శాతం కూడా దాటలేదు. మూడు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం దఖాస్తులు 26,527 రాగా, వీటిలో సరైన పత్రాలు లేకపోవడం, ఇతర కారణాలు చూపుతూ 6,451 దరఖాస్తులను రిజెక్ట్ చేశారు. అలాగే మరో 2,993 దరఖాస్తులను ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, ప్రభుత్వ భూములకు సంబంధించినవని ధ్రువీకరించి వాటిని కూడా పరిగణలోకి తీసుకోలేదు. ఇవి పోగా మిగిలిన 17,083 దరఖాస్తులను క్రమబద్ధీకరణకు అర్హత ఉన్న స్థలాలుగా గుర్తించి, ఆయా స్థలాల దరఖాస్తుదారుల నుంచి ఫీజు వసూలు చేస్తున్నారు. అయితే గురువారం నాటికి 1,105 (6.5శాతం) మంది మాత్రమే ఫీజు చెల్లించారు. వీరిలో 525 మందికి ఇంకా ప్రొసీడింగ్ కాపీలు కూడా అందలేదు. ఇందులో ఎక్కువగా నిర్మల్ మున్సిపాలిటీ నుంచే 810 మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారు. భైంసా పట్టణంలో 225, ఖానాపూర్ నుంచి 70 మంది ఇప్పటి వరకు తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం డబ్బులు కట్టారు.

## మాజీ మంత్రి కుటుంబ సభ్యులను కలిసిన కవిత

ఎదులాపురం, మార్చి 27 : మాజీ మంత్రి, ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న కుటుంబాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదులోని జోగు రామన్న నివాసానికి చేరుకోగా.. శాలువాతో సత్కరించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేస్తూ పలు అంశాలపై చర్చించారు. ప్రస్తుతం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే దీక్షల గురించి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీఆర్ఎస్ పార్టీ పక్షాన ఒత్తిడి పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, యువ నాయకులు జోగు మహేందర్, రంగినేని శ్రీనివాస్, గోపీ పాల్గొన్నారు.

రామన్న కుటుంబ సభ్యులతో జాగృతి అధ్యక్షురాలు కవిత

## ప్రైవేటుగా దీటుగా వైద్యం అందించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

సోన్, మార్చి 27 : ప్రైవేటుగా దీటు గా ప్రభుత్వ ఆసుపత్రిల్లో వైద్య సేవలందించాలని కలెక్టర్ అభిలాష అభిన వ్ అన్నారు. గురువారం నిర్మల్ మండలం ముజ్గి ప్రాథమిక ఆరోగ్య కేం ద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. బ యోమెట్రిక్ హాజరు, ఇన్ పెషెంట్ వా ర్డు, ఆయుష్ క్లినిక్, డ్రగ్స్ స్టోరూంలను సందర్శించారు. రిజిస్టర్లను పరిశీలించి అందిస్తున్న సేవలు, రోగులకు లభిస్తున్న సదుపాయలపై వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. సరిపడినన్ని బెడ్లు, మందులు, ఇతర వైద్య పరికరాలు అందుబాటులో ఉండాలని సూచించారు. డీఎంహెచ్‌వో రా జేందర్, వైద్యశాఖ అధికారు లు శ్రీనివాస్, రవీందర్, తహసీల్దార్ సంతో ష్, ఎంపీడీవో గజానంద్ ఉన్నారు.

## గుర్తింపు కార్డుల ప్రక్రియ ప్రారంభించాలి

సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 27 : నిర్మల్ జిల్లాలో ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులను జారీ చేసేందుకు అర్హుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈవో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సెక్రటరీ లోకేశ్‌కుమార్‌తో కలిసి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. యూడీఐడీ కార్డులు పొందేందుకు దివ్యాంగులు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం సివిల్ సప్లయ్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఎదులాపురం, మార్చి 27 : ఏప్రిల్ 30వ తేదీలోగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ కేసులు, ప్రభుత్వాల ద్వారా వారికి అందుతున్న సేవలు, పథకాల అమలు తీరుపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షా పుష్పగుచ్చం అందించి స్వాగతించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి అధికారులతో సమావేశం నిర్వహించారు. శాఖలవారీగా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధితోపాటు అట్రాసిటీ కేసుల గురించి తెలుసుకుంటు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ, దళిత సంఘాల నాయకులు వారి సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూడాలని కలెక్టర్‌తోపాటు ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పడితే అధికారులపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఇటీవల గుడిహత్నూర్‌లో ఆదివాసీ బాలికపై జరిగిన ఘటన బాధాకమన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం రెండు రోజుల్లో అందేలా చూడాలని కలెక్టర్‌కు సూచించామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో మాట్లాడి డీఏఎంసీ కమిటీలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాదేవి, ప్రవీణ్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఎఫ్ఎ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఎస్పీ అఖిల్ మహాజన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, డీఎస్సీడీవో భగత్ సునీత కుమారి పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం..

గుడిహత్నూర్, మార్చి 27 : కొన్ని నెలల క్రితం ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రంలో మైనర్ బాలిక అత్యాచారానికి గురైన కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆ బాలిక ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. పోలీసులు అమాయకులపై కేసులు పెట్టారని ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందేనని తప్పు చేయని వారిపై కేసులు ఎత్తి వేయాలని ఎస్పీకి ఆదేశాలు ఇస్తామని పేర్కొన్నారు. అందకు ముందు బస్టాండ్ వద్ద ఉన్న బీఆర్ అంబేద్కర్, కుమ్రం భీం, అన్నా బాహుసాఠే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

## స్థాయికి మించి వైద్యం అందిస్తే చర్యలు

డయాగ్నొస్టిక్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారి

నేరడిగొండ, మార్చి 27 : ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్‌లు స్థాయికి మించి వైద్యం అందిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఎంవో రవిశంకర్ హెచ్చరించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాథోడ్ నరేందర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్, డయాగ్నొస్టిక్ సెంటర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతర దాడులు కొనసాగుతాయని, రిజిస్ట్రేషన్ లేని ల్యాబ్ యాజమానులు, ప్రాక్టీషనర్‌లు డీఎంహెచ్‌వో కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. నేరడిగొండలోని వసంత్, ఏఎస్ డయాగ్నొస్టిక్ సెంటర్లను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైద్యాధికారుల సోదాలు

బోథ్, మార్చి 27 : బోథ్, సొనాల మండల కేంద్రాల్లో గురువారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. బోథ్‌లోని పలు క్లినిక్, డయాగ్నొస్టిక్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎటువంటి అనుమతి లేని విశ్వనాథ్ ఫస్ట్ ఎయిడ్ కేంద్రాన్ని సీజ్ చేశారు. అనంతరం సొనాలలో క్లినిక్‌లను తనిఖీ చేశారు. శ్రీసాయి క్లినిక్‌ను సీజ్ చేశారు. ఆర్ఎంపీలు ఎటువంటి అనుమతి లేకుండా క్లినిక్‌లు నడిపితే చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్స్‌టెన్షన్ మీడియా అధికారి రవి శంకర్ హెచ్చరించారు. తనిఖీలో జిల్లా ఆరోగ్య బోధకుడు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను కలిసిన జాగృతి అధ్యక్షుడు

కేసీఆర్‌ను కలిసిన జాగృతి అధ్యక్షుడు శ్రీనివాస్

ఎదులాపురం, మార్చి 27 : ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గురువారం తెలంగాణ జాగృతి అధ్యక్షులు రెంగిని శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. పలు విషయాలపై ఆయనకు తెలిపారు.

## లెప్రసీ ఉన్నవారిని గుర్తించాలి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 27 : నిర్మల్ జిల్లాలో జరుగుతున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకుడు సాగర్, పీవో రవీందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. నిర్మల్ పట్టణంలోని రాంనగర్, బంగల్‌పేట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం అంకితభావంతో నిర్వహించాలని, లెప్రసీ లక్షణాలున్న వారిని గుర్తించి చికిత్స అందేలా కృషి చేయాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

## పశువులను తరలిస్తున్న వాహనాల పట్టివేత

నేరడిగొండ, మార్చి 27 : రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా పశువులను తరలిస్తున్న ఏడు వాహనాలను సామాజిక కార్యకర్త సాబ్లె సంతోష్‌సింగ్ యువకులతో కలిసి పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి వాహనాలలో అక్రమంగా పశువులను తరలిస్తున్నట్లు సమాచారం అందింది. వెంటనే టోల్‌ప్లాజా వద్దకు యువకులతో కలిసి చేరుకుని వాహనాలను ఆపారు. అనంతరం నేరడిగొండ పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. 4 ఐచర్ వాహనాలు, 3 బొలేరో వాహనాల్లో పశువులు ఉన్నట్లు గమనించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వెంటనే వాహనంలో ఉన్నవారిని అదుపులోకి తీసుకొని పోలీస్టేషన్‌కు తరలించారు. వాహనాల్లో ఉన్న సుమారు 79 పశువులను ఇచ్చోడ గోశాలకు తరలించారు.

పట్టుకున్న వాహనాల వద్ద యువకులు, పోలీసులు

## మట్కా స్థావరంపై దాడి

జైనథ్, మార్చి 27 : గిమ్మా గ్రామంలోని కటింగ్ షాప్ ఎదురుగా మట్కా నిర్వహిస్తున్న నిర్వాహకులపై గురువారం పోలీసులు దాడి నిర్వహించారు. ఎస్సై వి.పురుషోత్తం, ఏఎస్సై సిరాజ్, కానిస్టేబుల్‌లు వికాస్, స్వామి దాడి చేసి మట్కా నిర్వాహకుడైన ఆవునూరి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద గల రూ.25 వేలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నారు. జైనథ్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సీఐ సాయినాథ్ మాట్లాడుతూ.. సామాన్య ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి మట్కా డబ్బులను పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రకు పంపుతున్నారన్నారు. శ్రీనివాస్‌ను ఏ1గా, మాధవ్ ఏ2గా, ఏ3గా అశోక్ సామ్రాట్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

## తప్పిన పెను ప్రమాదం

ఎదులాపురం, మార్చి 27 : ఆదిలాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. ఆవరణలోని చెట్ల పొదల్లో మంటలు అంటుకున్నాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. చెట్ల పొదల మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అగ్నిమాపక సిబ్బంది సరైన సమయంలో రావడం, మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

## కస్తూర్బా పాఠశాల పరిశీలన

లక్ష్మణచాంద, మార్చి 27 : లక్ష్మణచాంద కేజీబీవీని పాఠశాలను గురువారం రాష్ట్ర విద్యా శాఖ పరిశీలకుడు ఎల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల సీసీఈ మూల్యాంకన రికార్డులను పరిశీలించారు. భాషాభివృద్ధికి నిర్వహించే కార్యక్రమాలను ప్రత్యేకాధికారి నవితను వివరాలు అడిగారు. జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త నర్సయ్య, మండల విద్యాశాఖ అధికారి అశోక్‌వర్మ, సీఆర్‌పీలు సుధాకర్, మహేందర్‌లు పాల్గొన్నారు.

## ఈత రాక బాలుడి మృతి

ఇచ్చోడ, మార్చి 27 : ఈత రాక బాలుడు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సాకేర గ్రామానికి చెందిన గుడిసె ధనుష్(12) తన తల్లి సునీతతో కలిసి 26న శుభకార్యానికి నర్సాపూర్ గ్రామానికి చెందిన తన చిన్నమ్మ నాగమ్మ ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం కాలకృత్యాల కోసం స్నేహితుడితో కలిసి పొలానికి వెళ్లాడు. బావి దగ్గర ఈతకు అని వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి ఈత రాక మృతి చెందాడు. తోడుగా వెళ్లిన స్నేహితుడు గణేశ్ గ్రామస్తులకు, కుటుంబీకులకు సమాచారం అందించాడు. అక్కడ వెళ్లి బావి నుంచి బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.